క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ప్రత్యేకాధికారి

సైదాపురం: పక్కా ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రావణ్‌కుమార్ కోరారు. దేవరవేమూరు గ్రామంలో శనివారం పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దేవరవేమూరు గ్రామ సచివాలయ పరిధిలో రూ.కోటి వ్యయంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఆయన వివరించారు. అనంతరం కొత్తగా నిర్మాణం పూర్తిచేసుకున్న పక్కా గృహాల నిర్మాణాల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆయన వెంట ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, ఏఈ భాస్కర్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

సైదాపురం: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జోన్–1 సూపర్‌వైజర్ హరికృష్ణ అన్నారు. తురిమెర్ల గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ చైతన్య అధ్యక్షతన శనివారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం వారి ఆధ్వర్యంలో సుఖవ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీఏ ల్‌డబ్ల్యూ రత్నయ్య పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు



పదవీకాలం పొడిగింపు ఉత్తర్వులను శోభారాణికి అందిస్తున్న సీఈఓ

ఓజిలి: రైతులకు విరివిగా రుణాలు అందజేస్తున్నామని కురుగొండ సహకారసంఘం అధ్యక్షురాలు ఉచ్చూరు శోభారాణి అన్నారు. సీపీసీఎస్ అధ్యక్షుల పదవీకాలం మరో ఆరునెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం అందించిన ఉత్తర్వులను సీఈఓ రవీంద్రయ్య శనివారం మానసమాలలోని ఆమె నివాసంలో అందజేశారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో రైతులకు రూ.14 కోట్ల రుణాలు అందజేశామన్నారు. రూ.40 లక్షలతో రైతులకు ఎరువులు అందించామని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరించామని చెప్పారు. సహకార సంఘంలో తనకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏ అంత్యక్రియలకు ప్రభుత్వ సాయం



కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న తహసీల్దార్

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలం కాలగంధ వీఆర్‌ఏ ఎం నాగమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. విషయం తెలిసి బాలాయపల్లి తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ వీఆర్‌ఏ అంత్యక్రియలకు రూ.25వేలు ప్రభుత్వ నిధులు తక్షణ సాయం కింద శనివారం నాగమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు.

నెల్లటూరులో ఉచిత కంటి వైద్యశిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

గూడూరు: గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లటూరు గ్రామంలో శనివారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియా విజన్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిమ్మ, పాడి రైతులకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ జిల్లా అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, నేత దయాకర్, సెక్రటరీ కోటయ్య, చిన్నయ్య, సురేష్, శోభారాణి, ఇండియా విజన్ ఇన్‌స్టిట్యూట్ ప్రోగ్రామ్ అధికారులు ఐశ్వర్య, అనిషా, కళారంజని, మస్తానమ్మ, మస్తానయ్య, గోపాల్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో రెండు రోజులు కిందట ఇంట్లో ఒంటరిగా ఉన్న సంధ్య ఉంగరాన్ని దొంగలించి పరారైన నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. విచారణలో నిందితుడు నిడుముసలి గ్రామానికి చెందిన బండ్ల వినయ్ అని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని పట్టణంలోని మట్లాం జాతీయ రహదారి కూడలి వద్ద శనివారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రభాకర్‌రావు తెలిపారు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసి పేదప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక నేదురుమల్లి బంగ్లా ఆవరణలో శనివారం పార్టీ జేఎస్‌సీ కన్వీనర్‌లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమం జరిగింది. అందులో నేదురుమల్లి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జిల్లాలో 7 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుబి మోగించి, తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు వలంటీర్లు, జేసీఎస్ కన్వీనర్‌లు, గృహసారథుల పాత్ర కీలకం కావాలన్నారు. జేసీఎస్ రాష్ట్ర నాల్గవ జోన్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జేసీఎస్ కన్వీనర్‌లు, గృహసారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను ఏ విధంగా తిలోదకాలు ఇచ్చారో.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99.99శాతం ఏ విధంగా అమలు చేస్తున్నారో వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకులు సీహెచ్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు క్రియాశీలకంగా వ్యవహరించే జేసీఎస్ కన్వీనర్‌లు, గృహసారథులకు భవిష్యత్తులో గ్రామస్థాయిలో పదవులు పొందుతారని తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న నమ్మకంతోనే గత ఎన్నికల్లో 151 స్థానాలు వచ్చాయని రాజాకుటుంబీకుడు సర్వజ్ఞకుమార యాచేంద్ర తెలిపారు. తాము కొన్నిదశాబ్దాలుగా టీడీపీకి పనిచేసినా దక్కని గౌరవం తక్కువ సమయంలో వైఎస్సార్‌సీపీలో వచ్చిందని, సీఎం వైఎస్ జగన్‌ను నమ్ముకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనేందుకు తమ కుటుంబమే ఉదాహరణ అని తెలిపారు. మాజీ సీఎం చంద్రబాబుకు సీఎం వైఎస్ జగన్‌కు నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా ఉందని, ప్రజలు గమనించి వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించేందుకు సహకరించాలని తెలిపారు. నెల్లూరు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, నేతలు చెలికం శంకరరెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, కౌన్సిలర్‌లు ఎంఎ నారాయణ, ధనియాలరాధ, మల్లీశ్వరి, సుభావలి, టి.సుబ్బారావు, ఏ. శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



కిట్ల గురించి వివరిస్తున్న నేదురుమల్లి, శివశంకర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, యాచేంద్ర

జగనన్నకే మళ్లీ పట్టం కట్టండి



తల్లంపాడు ఎస్సీ కాలనీలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు చూసి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగనన్నకే మళ్లీ పట్టం కట్టాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. లింగంపాడు, అయ్యపాళెం, టపాయిండ్లు, దిగువమేలుపాక, తల్లంపాడు గ్రామా ల్లో, ఆయా ప్రాంతాల్లోని ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ఎమ్మెల్యే కిలివేటి శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే తమ దృష్టికి తీసురావాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. తాగు నీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా గ్రామ స్థాయిలో ఆర్బీకేలు, సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ముందుకు సాగాలన్నా, రైతుకు కష్టం రాకూడదన్నా జగనన్నకే మళ్లీ అధికారం ఇవ్వాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో చెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ రమేష్, సర్పంచ్ వీణ, నేతలు రాహుల్ రెడ్డి, తిరుపాల్, మునస్వామినాయుడు, రామచంద్రయ్యానాయుడు, కృష్ణయ్య, పురుషోత్తం, గోవర్ధన్, బాబురెడ్డి, శోభారాణి, బాబు, ఎంపీడీఓ సింగయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

గూడూరు: తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని శనివారం తిరుపతిలోని కలెక్టర్ బంగ్లాలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. గూడూరు దివిపాళెం లేఔట్‌కు సంబంధించి రైల్వే ట్రాక్ సమస్యపై కలెక్టర్‌తో చర్చించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు చిల్లకూరు సాయి ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు మహేష్, వెంకటేశ్వర్లు, హరి, పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సత్కరించిన ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి

అధినేతకు సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రవేశపెట్టిన పథకాలు తెలియజేస్తూ మన అధినేతకు సైనికులుగా పనిచేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. సూళ్లూరుపేట మండలంలోని రూరల్ ప్రాంతంలోని సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో శనివారం ఎంకేఎం కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరందరూ వైఎస్సార్ కుటుంబసభ్యులని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి తెలియజేయాలని సూచించారు. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయ్యేలా పార్టీని పటిష్టపరిచి బలం చేకూర్చాలని కోరారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో విప్లవాత్మక మార్పునకు సీఎం శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారని వారికి తోడుగా సారథులను ఎంపిక చేశామని మీరందరూ సమష్టి కృషి చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జగనన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవా దృక్పథంతో ప్రజలకు సేవలు చేయాలన్నారు. ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్ రెడ్డి, కుదిరి సర్పంచ్ బుంగా చెంగయ్య, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేవేంద్ర, నేతలు సుధాకర్, బద్దెపూడి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోట: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోటలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవాని పరిశీలించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 269 ఓట్లు ఉండగా కోట బాలుర ఉన్నత పాఠశాలలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీకి 2,821 ఓట్లు ఉండగా కోట బాలుర ఉన్నత పాఠశాలలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను అధికారులు పరిశీలించి సూచనలిచ్చారు. ఎంఈఓ వెంకటసునీల్, హెచ్‌ఎం మధుసూదన్ పాల్గొన్నారు.



కోట బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు

తడ: ఈనెల 11న జరగనున్న మెగా లోక్‌అదాలత్‌లో మండలంలో పెండింగ్‌లో ఉన్న కేసులు ఎక్కువ శాతం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ మహిళా పోలీసులను సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వరరెడ్డి ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం మహిళా పోలీసులు, స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, జూదం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరెడ్డి

కన్వీనర్లు, గృహసారథుల సమావేశం రేపు

రాపూరు: రాపూరు మండల జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి సోమవారం స్థానిక తెలుగుగంగ అతిథి గృహం వద్ద ఉదయం 9గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి పేర్కొన్నారు. అందరు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు,

మాజీ వీఆర్వో మృతి

పెళ్లకూరు: పుల్లూరు గ్రామానికి చెందిన మాజీ వీఆర్వో పి.శ్రీనివాసులురెడ్డి(75) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. శ్రీనివాసులురెడ్డి గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పలువురు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళి



విశ్వనాథ్, వాణిజయరాం చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

వెంకటగిరి: ప్రణతి సాహితీ సేవా సమితి ఆధ్వర్యంలో మృతిచెందిన కళాతపస్వి, ప్రముఖదర్శకుడు కె. విశ్వనాథ్‌కు, ఘంటసాల కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రముఖ గాయిని వాణిజయరాంలకు నివాళులర్పించారు. ప్రణతి సమితి అధ్యక్షుడు సుంకర రవి, సభ్యులు చిరంజీవి, వీరాస్వామి, ఎన్ రవి, పి శ్రీహరి, చెంచుకృష్ణయ్య, కె.రమాకాంత్, విజయకుమార్, చాముండమ్మ, భారతి పాల్గొన్నారు.

పుష్పయాగానికి అంకురార్పణ

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి పుష్పయాగం కార్యక్రమానికి శనివారం రాత్రి అంకురార్పణ చేశారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పుష్పయాగం నిర్వహించనున్నారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచు లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాల కొలువుదీర్చి పుష్పయాగం విజయవంతం అయ్యేందుకు ప్రత్యేక హోమాలు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఎంఆర్ నగర్ సచివాలయం పరిధిలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక శనివారం తెలిపారు. ఎంఆర్ నగర్ సచివాలయం పరిధిలోని శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యేతో పాటు అధికారులు, నేతలు పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని కేకే కల్యాణ సదన్‌లో మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, నూతనంగా ఎంపిక చేసిన గృహసారథులతో సమావేశం జరుగుతుందన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో వెంకటగిరి ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి అధ్యక్షతన రూరల్ మండల సర్వసభ్య సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు శనివారం పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా పాల్గొనాలని తెలిపారు.

ఐక్యత కోసం ప్రజల్లో ఉంటాం

సైదాపురం: బహుజనుల ఐక్యత కోసం నిరంతరం ప్రజల్లో ఉంటామని జాతీయ అధ్యక్షుడు డేగా రవి రాఘవేంద్రరావు అన్నారు. సైదాపురంలో శనివారం ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యూనైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో బహుజన చైతన్య రథయాత్ర సదస్సులను నిర్వహించారు. ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, మాకాణి వెంకటేశ్వర్లు, శేఖర్, పెంచలయ్య, పద్మజ, కృష్ణరేఖ పాల్గొన్నారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి

చిల్లకూరు: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నూతనంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చేపడుతున్న సర్వేను పక్కాగా పూర్తిచేయాలని ఎంపీడీఓ విష్ణుచిరంజీవి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని ప్రతి గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నుంచి యాప్‌లో సర్వే వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. సర్వే చేయడంలో అలసత్వం పాటించకుండా పూర్తిచేయాలన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

చిట్టమూరు: మల్లాం గ్రామంలోని సీవీఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో శనివారం వాకాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో సంఘ వ్యతిరేకశక్తులు విద్యార్థులను టార్గెట్ చేసుకుని చెడు అలవాట్లకు బానిసలను చేస్తూ డ్రగ్స్ అలవాటు చేస్తున్నారన్నారు. విద్యార్థులు స్నేహితులతో మెలిగేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పల్ బాబు, అధ్యాపకులు నాగేంద్ర, నాగార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు నివారణ చర్యలపై అవగాహన

నాయుడుపేట: కుష్టు నివారణ చర్యలపై శనివారం స్థానిక జనరల్ పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తుమ్మూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు నిత్యప్రశాంతి కుష్టు వ్యాధి నివారణపై ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. కుష్టు రహిత సమాజ స్థాపనకు అందరు కృషిచేద్దాం అంటూ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

అట్రాసిటీ కేసుపై పరిశీలన

నాయుడుపేటటౌన్: పుదూరు గ్రామ ఉపసర్పంచ్ పిలాసమణిపై నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 2న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ఓ పత్రిక సీనియర్ పాత్రికేయులు అద్దూరు రవిపై గత నెల 28 తేదీ మణి దౌర్జన్యం చేయడంపై ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శనివారం నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి కేసుపై విచారణ చేశారు. ఆయన వెంట సీఐ ప్రభాకర్‌రావు ఉన్నారు.

పరామర్శ

చిట్టమూరు: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డిని శనివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. శ్రీనివాసులురెడ్డి నానమ్మ సన్నారెడ్డి సత్యవతమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మేరిగ మురళీధర్ శ్రీనివాసులురెడ్డి స్వగ్రామం కృష్ణమనాయుడుకండ్రిగకు చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షేమం కావాలంటే మళ్లీ జగన్ రావాలి



లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

- ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు

వాకాడు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఎప్పటికీ అలాగే ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ఆకాంక్షించారు. బాలిరెడ్డిపాళెం సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు వెళుతుంటే పథకాల లబ్ధిదారులు ఘనంగా ఆహ్వానిస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. సచివాలయ పరిధిలోని ఉన్న గ్రామాల అభివృద్ధికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సంక్షేమ పథకాలను నేరుగా అందించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. నేడు సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించడంతో పాటు గృహసారథులను నియమించి మరింతగా పేదవాడికి పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. అలాగే మండలంలోని మత్స్యకారులకు అండగా ఉండేలా సముద్ర ముఖ ద్వారాల పూడికతీత పనులపై దృష్టి పెట్టామని చెప్పారు. త్వరలో గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రౌతు రామక్రిష్ణ, ఏఎంసీ చైర్ పర్సన్ నాగభూషణమ్మ, సొసైటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరమణమ్మ, సర్పంచ్ రమణమ్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్, సారంగపాణి, ఎంపీడీఓ గోపినాథ్, నేతలు మధురెడ్డి, అజిత్‌కుమార్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, భార్గవ్‌రామ్, కోటిరెడ్డి, వెంకటరత్నం, సుబ్బారెడ్డి, వెంకటయ్య, మణి పాల్గొన్నారు.

గృహసారథుల సమావేశం రేపు

సైదాపురం: మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి సారథ్యంలో జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్ పేర్కొన్నారు. సైదాపురానికి మొట్టమొదటిసారిగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి విచ్చేస్తుండడంతో కార్యక్రమం విజయవంతం చేసేందుకు బహిరంగసభ స్థలాన్ని శనివారం మండల నేతలతో ఆయన పరిశీలించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నేతలు మాలకొండారెడ్డి, అబ్బిరాజు, ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, శివ, ఎంపీటీసీలు వెంకటరమణయ్య, శ్రీనివాసులు, సాంబయ్య, నారాయణరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న నేతలు

డీఎల్‌పీఓ విచారణ

కోట: పట్టణంలోని ప్రగతి కళాశాల రోడ్డులో ఉన్న సిమెంటు బ్రిక్స్ తయారీ కేంద్రాన్ని శనివారం గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ పరిశీలించారు. సిమెంటు బ్రిక్స్ తయారుచేస్తున్న చోట కాలుష్యం అధికంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన క్రమంలో అధికారులు విచారణ జరిపారు. డీఎల్‌పీఓ స్థానికులను విచారించి వారి నుంచి అభిప్రాయసేకరణ జరిపారు. అదేవిధంగా సర్పంచ్ వెంకటరమణమ్మతో పాటు కొందరు ప్రజాప్రతినిధులు వెల్లడించిన అంశాలను కూడా పరిగణలోకి తీసుకున్నట్లు ఈ సందర్భంగా డీఎల్‌పీఓ తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆయన వెంట కోట పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలో మామిడి కాలువ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని మండల పరిధిలోని పెరికిలింపాటి కండ్రిగ గ్రామానికి చెందిన మాణికల రామయ్య(30) మృత్యువాత పడ్డాడు. రామయ్య శనివారం ఓజిలి గ్రామం వద్దకు వెళ్లి తిరిగి బైక్‌పై నాయుడుపేటకు వస్తుండగా మార్గమధ్యంలో మామిడి కాలువ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రామయ్య తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ ప్రభాకర్ రావుతో పాటు ఎస్‌ఐ వేణు సంఘటనా స్థలానికి చేరుకుని రామయ్య మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.